# <u>పత్రికా ప్రకటన</u>

తేది:14.04.2023

ద్రావిడ విశ్వవిద్యాలయం యుజిసి ఎస్సి, ఎస్టి సెల్ కోఆర్డినేటర్ డా.జి.శైలమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం వర్శిటీ శ్రీకందుకూరి వీరేశలింగంపంతులు ఆడిటోరియంలో డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి అదేవిధంగా ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి, ఏప్రిల్ 05న డా.బాబు జగ్జీవన్‌రామ్ జయంతిల సందర్భంగా మహనీయుల జయంత్యోత్సవాల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ మహనీయుల జయంత్యోత్సవాల సభకు విశిష్ట అతిథిగా పాల్గొన్న వర్శిటీ రెక్టార్ ఆచార్య టి.అనురాధ మాట్లాడుతూ... 19వ శతాబ్దంలో చాలా మంది సంఘసంస్కర్తలు వివిధ అంశాలపై ఉద్యమాలు చేశారని అయితే జ్యోతిరావు పూలే గారు ప్రత్యేకించి స్త్రీలకు సంబంధించిన వివక్షలపై తీవ్రంగా పోరాడారని అన్నారు. అదేవిధంగా లింగవివక్షతకు, కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడి తిరుగుబాలు చేశారని అన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య పరంగా ఎప్పుడు మెరుగుపడుతారో అప్పుడే దేశం బాగుపడుతుందని గుర్తించి అనేక ఉద్యమాలు ప్రారంభించారని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్.అంబేద్కర్, డా.బాబూ జగ్జీవన్‌రామ్ మహనీయుల యొక్క సేవలు, సమాజంలో ఉన్న వివక్షతపై వారు చేసిన పోరాటం మరువలేనిదని.. ఆ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న వర్శిటీ రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... మహాత్మా జ్యోతిరావు పూలే గారు కన్న కల నేడు సాకారమైందని తాను నమ్ముతున్నాని.. ప్రస్తుతం విద్యాలయాల్లో విద్యార్థినుల సంఖ్య పెరగడం చూస్తే తెలుస్తుందన్నారు. అదేవిధంగా డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశించిన వివక్షరహిత సమాజం కూడా నేడు మనం చూస్తున్నామన్నారు. ప్రస్తుతానికి రాజ్యాంగంలో అనేక రకాల మార్పులు చేస్తున్నారని.. వీటికి సంబంధించిన మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హక్కుల గురించి మాట్లాడటం కాదని.. బాధ్యతలను గుర్తుపెట్టుకోవాలని... ప్రతి మనిషి తోటి వారిని మనుషులుగా చూడాలనే స్ఫూర్తి ఉండటమే నిజమైన మానవత్వమని అన్నారు. ప్రస్తుతం భారతదేశ ప్రధానమంత్రి వెనుకబడిన కులాలకు చెందిన వ్యక్తి అని, అత్యున్నత పదవైన రాష్ట్రపతి పదవి ఎస్సి, ఎస్టి కులాలకు చెందిన వారు అధిరోహిస్తున్నారని అన్నారు. అగ్రవర్ణాల గుప్పెట్లో వ్యవస్థలు ఉందన్న వాదన ఏమాత్రం సరికాదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో బాధ్యతాయుతమైన పౌరులుగా ఉండాలన్నారు.

ఈ సభకు వక్తగా పాల్గొన్న వర్శిటీ ఎడ్యుకేషన్ విభాగం ఆచార్యులు ఎస్.విజయవర్ధిని మాట్లాడుతూ... 19, 20 దశాబ్దాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే, డా.బి.అర్.అంబేద్కర్‌లు మార్పును మొదటగా తమ కుటుంబంతోనే ప్రారంభించారన్నారు. బ్రాహ్మణిజం ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి 'స్త్రీ' జనోద్ధరణకు కృషి చేశారన్నారు. అంబేద్కర్ జ్యోతిరావు పూలే గారిని గురువుగా స్వీకరించాడంటే పూలే ఏ స్థాయిలో కృషి చేశారో అర్థమవుతుందని అన్నారు. పూలే గారికి 13వ ఏట పెళ్ళి జరిగిందని అప్పుడు ఆయన భార్యకు 8 సంవత్సరాలని మొదట తన భార్యకు చదువు నేర్పించిన ఘనత ఆయనే దక్కిందన్నారు. నేడు భారతదేశంలో

మొదటి ఉపాధ్యాయురాలని సావిత్రిభాయి పూలే గారిని అంటున్నామన్నారు. సావిత్రిభాయి పూలే గారు చదువు చెప్పేందుకు వెళ్తుంటే ఒక చీరను బ్యాగులో వేసుకుని వెళ్ళేదని.. వ్యతిరేకులు తనపై బురద చెల్లేవారని చీరంతా బురదమయమైతే బ్యాగులో తెచ్చుకున్న చీరను మార్చుకుని చదువులు చెప్పిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. నేడు ఈ వేదికపై మీ ముందు ఒక మహిళగా మాట్లాడుతున్నానంటే.. విద్యార్థినీలందరూ ఇక్కడ ఉన్నారంటే ఆరోజు వారు తెచ్చిన మార్పే కారణమన్నారు.

ఈ సభకు వక్తగా పాల్గొన్న ఆల్ ఇండియా బంజారాసేవా సంఘం కుప్పం అధ్యక్షులు ఎ.రవినాయక్ మాట్లాడుతూ... డా.బి.ఆర్.అంబేద్కర్ అంతర్జాతీయంగా దళిత బడుగు, బలమీన వర్గాల ఆకాంక్షను ప్రతిబింబించే విధంగా రౌండ్ టేబుల్ సమావేశాల్లో చర్చించారన్నారు. ఆ చర్చల ఫలితమే రాజ్యాంగం ద్వారా మనం పొందిన సమానత్వం అని అన్నారు.

అనంతరం వర్శిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వల్లూరు లోకనాథం ముగ్గురు మహనీయుల గురించి విపులంగా విద్యార్థులకు వివరించారు.

అదేవిధంగా మహనీయుల జయంత్యోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించి వ్యాస రచన, వకృత్త్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు, బహుమతులను అందజేశారు. అనంతరం అతిథులకు వర్శిటీ తరపున శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

**– డా.ఎమ్.ఎస్.దుర్గాప్రవీణ్, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం**








DRAVIDIAN UNIVERSITY




DRAVIDIAN UNIVERSITY



